ఉత్సవ ఏర్పాట్లు వేగవంతం

ప్రజాశక్తి - జలుమూరు

మహాశివరాత్రి సందర్భంగా శ్రీముఖలింగేశ్వర స్వామి ఉత్సవ ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ బి.శాంతి అధికారులను ఆదేశించారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు శ్రీముఖలింగంలో నిర్వహించే ఉత్సవ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి యాత్రికునికి సజావుగా దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. చక్ర తీర్థ స్నానాలకు స్వామి వారిని తీసుకువెళ్లే రహదారిని పరిశీలించి, ఎటువంటి అవాంతరాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏర్పాట్లపై ఎస్‌ఐ పారినాయుడును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ జి.వి రవికుమార్, సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఇఒ పి.ప్రభాకరరావు, ఇఒపిఆర్‌డి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రమాప్రభ నామినేషన్

- తరలివచ్చిన ప్రజాసంఘాల నేతలు, పట్టభద్రులు
- పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు... ఉత్తరాంధ్ర మలుపు : వక్తల ఉద్ఘాటన
- ప్రజల గొంతుకనవుతా : రమాప్రభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకటే ఉత్సాహం.. ఉత్తేజం. ఉత్తరాంధ్ర ప్రజల గొంతులు ఒక్కసారిగా.. ఒక్కటై నినదించాయి. 'పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్ర ఉద్యమాల గెలుపు' అంటూ హోరెత్తాయి. మహిళల కోలాటాలు, యువత తీన్‌మార్ డోలు చప్పుళ్లు.. కేరింతలు, నృత్యాలతో విశాఖ నగరం గురువారం కొత్త ఎన్నికల ఉత్సాహాన్ని సంతరించుకుంది. ఉత్తరాంధ్ర ప్రాంత వెనుకబాటుతనంపై ప్రశ్నించేందుకు ప్రజల గొంతుకై ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తోన్న విద్యాధికురాలు, సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ నామినేషన్‌కు గురువారం ఉదయం విశాఖకు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజాసంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పట్టభద్రులు, మహిళలు, నిరుద్యోగుల పెద్ద సంఖ్యలో వచ్చి కదంతొక్కారు.

భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద సభలో వందల మంది పాల్గొన్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కావాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని, రైల్వే జోన్ సాధన అవసరమని.. ఇలా సమస్య ఎక్కడ ఉంటే అక్కడ పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు అండగా ఉండే పిడిఎఫ్ అభ్యర్థి గెలుపుకోసం పెద్దపెట్టున నినదిస్తూ విశాఖ రోడ్లపై వందలాది మంది ముందుకు సాగారు. డాబాగార్డెన్ సరస్వతీ పార్కు నుంచి జగదాంబ జంక్షన్ మీదుగా ఈ భారీ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ సాగింది. 250కు పైగా ప్రజా సంఘాలు బలపరుస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభకు వివిధ తరగతుల నుంచీ మద్దతు లభించింది. తొలుత అంబేద్కర్, తర్వాత తెన్నేటి, మదర్ థెరిసా విగ్రహాలకు పూలమాల వేసిన తర్వాత ర్యాలీ ఆరంభమైంది.

గడచిన ఆరేళ్లుగా బిజెపి ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ ఒక్క ప్రజా సమస్యనూ పరిష్కరించలేదని, పైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిస్సిగ్గుగా సమర్థించు కున్నాడంటూ ర్యాలీ సందర్భంగా సాధారణ జనం మండిపడ్డారు. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు విభజన హామీ చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ ఆంధ్రప్రదేశ్‌కు, ఉత్తరాంధ్రకు అమలు చేయకుండా తీవ్ర ద్రోహం చేస్తోందంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ నగరంలో రమాప్రభ నామినేషన్ ర్యాలీ

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, చిత్రంలో పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, అజశర్మ

నిరంతర పోరాటశీలి పిడిఎఫ్ : వక్తలు

గురువారం నామినేషన్ దాఖలు చేసే ముందు కలెక్టరేట్ వద్ద 250 ప్రజా సంఘాలు సహా పిడిఎఫ్ సంయుక్తంగా సభ నిర్వహించాయి. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం మండలి బయటా, లోపలా పోరాడుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పిడిఎఫ్ అభ్యర్థిగా నిలబెట్టిన డాక్టర్ కె.రమాప్రభకు అవగాహన ఉందన్నారు. మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కోట్లకు పడగలెత్తే వారు ఓట్లు కోసం వస్తున్నారని, వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాడే వారిపై ఈ సర్కారు కక్ష కట్టిందని, ఉపాధ్యాయులు, ఉద్యోగులపై పెటీ కేసులు పెట్టడం సిగ్గుచేటని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ గడచిన ఆరేళ్లలో ఉత్తరాంధ్ర నుంచి పిడిఎఫ్ అభ్యర్థి మండలిలో లేనందున స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు బిజెపి ఒడిగట్టిందని, రైల్వే డివిజన్ పోయిందని, వస్తుందనుకున్న జోన్ రాకుండా కేంద్రం దొంగ నాటకాలతో కాలం నెట్టుకొస్తుందంటూ మండిపడ్డారు. పిడిఎఫ్ లేకపోతే విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఎంత అన్యాయం జరిగిందో చదువుకున్న వారంతా గుర్తించారన్నారు. తాజాగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్సీగా పోటీచేస్తూ 'ఓట్లేయండి.. సేవ చేస్తాం' అంటూ పట్టభద్రుల ఓట్లను అడుక్కుంటున్నారని, గడచిన 30 ఏళ్లుగా ఉత్తరాంధ్రలో వివిధ తరగతుల ప్రజలకు రమాప్రభ సేవలందిస్తున్నారని శర్మ గుర్తుచేశారు.

ఉత్తరాంధ్రకు రూ.24 వేల కోట్లకు గానూ రూ.450 కోట్లే వచ్చాయి : రమాప్రభ

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ప్రశ్నించే గొంతులు మూగబోతున్నాయని, ఎపి విభజన హామీ చట్టం ప్రకారం ఈ ప్రాంతానికి రూ.24 వేల కోట్ల నిధులు అభివృద్ధి కోసం రావాల్సి ఉండగా కేవలం రూ.450 కోట్లే వచ్చాయని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని మోసం చేసిందన్నారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి మూడున్నరేళ్లయినా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలకు, రైల్వే జోన్ సాధనకు సాగుతున్న పోరాటాలకు అండగా ఉంటానన్నారు.

పెద్ద సంఖ్యలో ఉద్యమ, ప్రజా సంఘాల నేతలు హాజరు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన సాగిన సభలోనూ, రమాప్రభ నామినేషన్ ర్యాలీలోనూ ఉద్యమ నేతలు సిహెచ్.నర్సింగరావు, కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి వేణు, డి.గోవిందరావు, అప్పలనర్స, ఎం.పైడిరాజు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల మండలి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా నుంచి స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుని ఎన్నికకు నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య గురువారం విడుదల చేశారు. నామినేషన్ పత్రాలను అభ్యర్థి గానీ, ఆయన ప్రతిపాదించిన వ్యక్తి గానీ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారికి గానీ కలెక్టరేట్‌లో అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల్లోపు ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. స్వీకరించిన నామినేషన్లను ఈనెల 24న పరిశీలించనున్నట్లు చెప్పారు. 27న మధ్యాహ్నం మూడు గంటల్లోపు నామినేషన్‌ను ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నట్లు వివరించారు. మార్చి 13న ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

'ఉపాధి'తో సుస్థిర వనరుల సృష్టి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల పేదరికాన్ని తొలగించి వెలుగులు నింపడమే ఉపాధి హామీ ముఖ్య ఉద్దేశమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. మండలంలోని ఫరీదుపేట, కేశవరావుపేటలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసల నివారణ, సుస్థిర వనరుల సృష్టి వంటివి ఇందులో భాగమేనన్నారు. కూలీలు ఉపాధి హామీ పనులను తమ సొంత పనులుగా భావించాలని, అప్పుడే చేసిన ప్రతి పని ఆశించిన ఫలితాన్ని ఇస్తుందన్నారు. రెండు పూటలా కనీసం ఆరు గంటల పాటు పనిచేస్తే గరిష్ట కూలి రూ.257 పొందవచ్చని చెప్పారు. కూలీలందరికీ వంద రోజుల ఉపాధి పనిదినాల కల్పనపై సిబ్బంది దృష్టిసారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ శోభారాణి, ఇసి ఈశ్వరమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రభాకర్, సురేష్, ఇతర ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న చిట్టిరాజు

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com
www.prajasakti.com

మహారాజశ్రీ విజయనగరం నాల్గవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. No : 45/2017

Between:
1. Relli Surappadu s/o Late Suryanarayana, aged 60 years, Hindu, coolly, residing at Vangapallipeta, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.
2. Relli Suryanarayana s/o Surappadu, aged 35 years, Hindu, Junior Advocate, r/o Vangapallipeta, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.
3. Majji Eswaramma w/o Ramana, aged 32 years, Hindu, Coolly, residing at Papayya - rajupalem, Sujathanagar, Pendurthi Mandal, Visakhapatnam District.
4. Kadimi Lakshmi w/o Nanaji, aged 30 years, Hindu, Coolly, residing at Veratnagar, Prahladapuram, Simhachalam, Visakha patnam City and District.
5. Relli Bhagyalakshmi d/o Surappadu, aged 27 years, Hindu, Coolly, residing at Vangapallipeta, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.
6. Relli Satyanarayana s/o Surappadu, aged 25 years, Hindu, Junior Advocate, r/o Vangapallipeta, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.

........Plaintiffs.

And:
1. Vempadapu Satyam alias Balayya s/o Late Krishna, aged 67 years, Hindu, Cultivation, residing at Vangapallipeta, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.
2. Mudunuru Jagannadha Raju s/o Late Subba Raju, aged 67 years, Hindu, Rtd. Trade Union Secretary of Shriramnagar, Garividi Village and Mandal, Vizianagaram District.
3. Kinthali Venkata Satyanarayana s/o Venkata Ramanayya, aged 68 years, Hindu, Business, residing at Cheepurupalli Main Road, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.
4. Reddi Jamalamma w/o Krishna, aged 48 years, Hindu, house wife, residing at Anjaneyapuram, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.
5. Bandaru Prakasa Rao s/o Late Butchayya, aged 67 years, Hindu, Rtd. Pera Medical Officer, residing at Kotha Gavidi Street, Cheepurupalli Village and Mandal, Vizianagaram District.
6. Mallareddi Kamala w/o Late Krishna Rao, aged 55 years, Hindu, house wife, residing at Teachers colony, Garividi Village and Mandal, Vizianagaram Dist.
7. Mallareddi Mohana Rao s/o Late Bhujanga Rao, aged 60 years, Hindu, private Employee, residing at Rekulashed colony, Garividi Village and Mandal, Vizianagaram District.
8. Mallareddi Prakasa Rao s/o Late Bhujanga Rao, aged 55 years, private Employee, residing at Rajam Village and Mandal, Srikakulam District.
9. Patnana Venkata Ramana Murty s/o Late Bodayya, aged 56 years, Hindu, Residing at Gollalamulagam Village, Cheepurupalli Mandal, Vizianagaram Dist.
10. Patnana Srinivasa Rao s/o Late Bodayya, aged 48 years, Hindu, Business, r/o Gollalamulagam Village, Cheepurupalli Mandal, Vizianagaram District.

.......Defendants

ప్రకటన

పైనెంబరు దావాలో అదనపు ప్రతివాదులను చేర్చుటకు దాఖలు చేసిన పిటిషనులో ఎనిమిదవ ప్రతివాదికి దావాలో ప్రోసెస్ కట్టినను నోటీసులు అందనందువలన పిటిషనరు కోరిన ప్రకారము పేపరు ప్రకటన ఆర్డరు వేసినారు. సదరు పేపరు ప్రకటన అంశముల ప్రకారము ఓ.యస్.45/2017 గలది **తే.24-2-2023** దీన మహారాజశ్రీ విజయనగరం నాల్గవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో వాయిదా కలదు. సదరు వాయిదాకు ఎనిమిదవ అసామి అయిన మల్లారెడ్డి ప్రకాశరావు తండ్రి లేటు భుజంగరావు, రాజాం గ్రామము మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా వారు పర్సనల్ గాగాని, ప్లీడరు గారి ద్వారా గాని **తే.24-2-2023 దీన ఉదయం గం.10-30 నిముషములకు** విజయనగరం కోర్టులో హాజరు కావలసి యున్నది. లేనియెడల మీ పరోక్షములో దావా ప్రోసీడింగ్సు జరుపబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

సి.హెచ్.వేణుగోపాలరావు
న్యాయవాది, చీపురుపల్లి,
Cell: 9440206282

విజయనగరం.
16-2-2023

కచ్చితత్వంతో కేసుల దర్యాప్తు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కచ్చితత్వంతో కేసుల దర్యాప్తు చేసి, నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యుఐ కేసులు, గ్రేవ్ కేసులపై మరింత శ్రద్ధ చూపి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నేర రహిత సమాజంగా జిల్లాను తీర్చిదిద్దాలని, నిందితులకు కోర్టులో శిక్ష పడేలా పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. శిక్షల శాతం పెరిగితే బాధితులకు న్యాయం చేకూరుతుందన్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదైనప్పట్నుంచీ కేసు దర్యాప్తు పూర్తయ్యేంత వరకు నేరాలను కేసు పత్రాలు, సాక్షుల విచారణ, కోర్టుకు సమర్పించడంలో విచారణాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు సత్వరమే అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కేసులో కచ్చితమైన దర్యాప్తు ఉండాలని స్పష్టం చేశారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లో సాక్ష్యాధారాలు సేకరించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోక్సో, మహిళలపై నేరాల్లో దర్యాప్తును వేగవంతం చేసి ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసులను ఛేదించాలని చెప్పారు. మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో మహిళ పోలీసుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దత్తత కానిస్టేబుల్ గ్రామ సందర్శనలు చేసి శాంతిభద్రతలతో పాటు స్థానిక అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సిసి కెమెరాలను అమర్చడంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు కృషి చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ఫేస్ వాష్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు.

ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సిఐ శ్రీనివాసరావు

శాసనమండలి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, చెక్‌పోస్టుల విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన రెండో పట్టణ సిఐ శ్రీనివాసరావు, కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు గణేష్, విజయ్‌కుమార్, మధుసూదనరావు, కృష్ణారావు, రాజేష్‌కు ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, శివరాం రెడ్డి, ఎస్.వాసుదేవ్, జి.శ్రీనివాసరావు, డి.ప్రసాదరావు, ఎఒ ఎం.శివరామరాజు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

భోజనం బాగోడం లేదు

డిఇఒకు చీటీలపై రాసి ఇచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి - పలాస

స్థానిక జ్యోతిరావు పూలే పాఠశాలలో బుధవారం రాత్రి అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు ఆరా తీశారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, జ్యోతిరావు పూలే పాఠశాలల జిల్లా కన్వీనర్ జె.లక్ష్మణమూర్తి, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. అనంతరం జ్యోతిరావు పూలే పాఠశాలను పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, భోజనం సక్రమంగా పెడుతున్నారా?, ఆహారం రుచికరంగా ఉంటుందా తదితర అంశాలను విద్యార్థులను అడిగారు. సమస్యలు చెప్పేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతుండడాన్ని గమనించిన డిఇఒ, చీటీలపై రాసి ఇవ్వాలని సూచించారు. వాటన్నింటినీ చదివిన ఆమె ప్రిన్సిపాల్ విద్యాధరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ అందుబాటులో ఉండడం లేదని తమ పరిశీలనలో తేలిందన్నారు. విద్యార్థులకు పెట్టే భోజనం ఒక్కో రోజు ఒక్కోలా ఉంటుందన్నారు. తాగునీటిని బయట నుంచి తీసుకురాకుండా స్వజలధారను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డిఇఒ, ఇతర అధికారులు భోజనం చేశారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఇఒ పగడాలమ్మ

మళ్లీ వాంతులు

పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను గురువారం ఉదయం డిశ్చార్జి చేశారు. పాఠశాలకు వచ్చిన కొద్ది సమయానికే ఎనిమిది మంది విద్యార్థినులకు మళ్లీ కళ్లు తిరగడంతో పాటు వాంతులయ్యాయి. దీంతో వారిని మళ్లీ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

సంతాన సాఫల్య కేంద్రాల
నమోదు తప్పనిసరి

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతాన సాఫల్య చికిత్సలు అందించే కేంద్రాలు తప్పకుండా నమోదు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి ఆదేశించారు. నగరంలోని ప్రైమ్ సత్తారు స్రవంతి ఐవిఎఫ్, ఎ-1 హాస్పిటల్ ఎఆర్‌టి కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరల పట్టిక వివరాలను తెలుగులో డిస్‌ప్లే చేయాలని సూచించారు. పేదలకు అనుకూలమైన ధరలకు వైద్యం అందించాలన్నారు. నూతన చట్టం మేరకు కేంద్రాల్లో మౌలిక వసతులు, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని ప్రయివేటు ఆస్పత్రులను ఆకస్మిక తనిఖీలు చేస్తామని, అనధికారికంగా ఆస్పత్రులు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ప్రభుత్వ సర్వజనాస్పత్రి గైనకాలజిస్ట్ స్వర్ణలత, రేడియాలజిస్టు శరత్‌చంద్ర, పాథాలజిస్టు జగదీశ్వరి, సోషియాలజిస్టు ఎం.అచ్యుతరావు, ఎన్‌జిఒ సభ్యులు ఎం.వెంకటస్వామి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

జిల్లాలో వందకు పైగా ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వాటిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో యువ టూరిజం క్లబ్‌ను గురువారం ప్రారంభించారు. జిల్లాలో ఉన్నత పాఠశాల స్థాయిలో ఇది మొదటి క్లబ్ అని చెప్పారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో అన్ని ఉన్నత పాఠశాలల్లో వీటిని స్థాపించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇంటాక్ అదనపు కన్వీనర్ వి.జగన్నాథ నాయుడు మాట్లాడుతూ మన సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షించబడాలంటే పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చెందాలన్నారు.

పర్యాటకశాఖ, భారత జాతీయ కళలు, సంస్కృతి వారసత్వ సంస్థ, ఇంటాక్ న్యూఢిల్లీ తరుపున శ్రీకాకుళం చాప్టర్ పర్యాటక క్లబ్బుల ఏర్పాటుకు సహకరిస్తుందన్నారు. టూరిజం కౌన్సిల్ మెంబర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ యువ క్లబ్‌ల నిర్వహణ సిబిఎస్‌ఇ వారు రూపొందించిన మార్గదర్శకాలను తెలుగులోకి అనువదించి క్లబ్‌లకు అందించి శిక్షణను ఇస్తామన్నారు. నెహ్రూ యువ కేంద్రం సమన్వయ అధికారి ఎన్.ఉజ్వల్ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధి విషయంలో యువజన సంఘాలు సహకరిస్తాయన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ క్లబ్ ద్వారా తమ విద్యార్థులకు భవిష్యత్‌లో ప్రయోజనం ఉంటుందన్నారు. జిల్లా పర్యాటక వైభవాన్ని వారు తెలుసుకొని ప్రచారం చేస్తారన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ కోఆర్డినేటర్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

యుబి కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - రణస్థలం

యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ కార్మికులందరికీ పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని యుబి కార్మికులందరికీ పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని, సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన విశాఖపట్నంలో కార్మిక సంయుక్త కమిషనర్ ఎం.రామారావుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుబి యాజమాన్యం 600 మంది కార్మికులకు 2019 నవంబరు నుంచి కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు ఇవ్వకుండా నెలకు 13 నుంచి 16 రోజులు మాత్రమే పనిలోకి తీసుకుంటుందన్నారు. పూర్తిస్థాయి పనిదినాలు లేకపోవడం వల్ల కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక కార్మిక కుటుంబాలు జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పనిదినాలు తగ్గిపోవడంతో ఇఎస్‌ఐ వైద్యానికీ అర్హత కోల్పోయారని చెప్పారు. జెసిఎల్ నిర్వహించిన సంయుక్త సమావేశంలో కార్మికులందరికీ 26 రోజులు పని కల్పించాలని, లేకుంటే 50 శాతం వేతనాలు చెల్లించాలన్నారు. చట్టబద్ధమైన అంశాలు అమలు చేయమని యాజమాన్యాన్ని ఆదేశించినా నేటికీ అమలు చేయడం లేదని తెలిపారు. యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు, ఎటువంటి విచారణ లేకుండా కార్మికులను అక్రమంగా నిలుపుదల చేస్తోందని చెప్పారు. అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని యుబి కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించేలా, యాజమాన్యం ఇచ్చిన అదనపు సెలవు రోజులకు వేతనాలు చెల్లించేలా, నిలుపుదల చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇజ్జు నారాయణరావు, నాయకులు పి.సత్యనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే కృష్ణదాస్

నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- జలుమూరు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి రోనంకి జయప్రకాష్ అన్నారు. మండలంలోని కరవంజ ఆదర్శ పాఠశాలలో గురువారం నిర్వహించిన పదో యానివర్సరీ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతర పఠనం విద్యార్థుల మేధాసంపత్తిని పెంపొందింపజేస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జబర్దస్త్ ఫేమ్ సాగర్ నిర్వహించిన మ్యాజిక్ అండ్ పప్పెట్ షో చూపరులను ఆకట్టుకుంది. బైపిసిలో 98 శాతం మార్కులు సాధించిన రఘుపాత్రుని నవ్యశ్రీకి ఎమ్మెల్యే నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, సర్పంచ్ జుత్తు నేతాజీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని గృహ సారథులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దిశా నిర్దేశం చేశారు. స్థానిక ప్రగతి భవనం ప్రాంగణంలో గృహ సారథులకు, బూత్ కన్వీనర్లకు గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రజలకు చేరువవుతున్నవి, లేనవి తెలుసుకోవాలన్నారు. నిత్యం ప్రజతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. వారి కష్టాలను తెలుసుకుని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్క కుటుంబ సభ్యులనూ కలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు సూర్యనారాయణరాజు, చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంపిపి ఉంగ ప్రవీణ, జెడ్‌పిటిసి మచ్చ రత్నాలమ్మ, మండల పార్టీ అధ్యక్షులు పైల వెంకటరమణ, హనుమంతు వెంకటరావు, గొర్లి వేణు, పుష్పలత, జనక లోకేశ్వరి, తలగాన శ్రీరాములు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

డిఇఒ పగడాలమ్మ

ప్రజాశక్తి- పలాస

మరో 45 రోజుల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకొని శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాలని డిఇఒ గార పగడాలమ్మ విద్యార్థులకు సూచించారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు జరిగినంతకాలం నిరంతరం చదువుపై దృష్టి సారించాలన్నారు. పూర్తిగా వచ్చిన సమాధానాలను అప్పుడప్పుడు చదువుతూ... రాని ప్రశ్నలకు నేర్చుకునే దిశగా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. పాఠశాలలలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. అవసరమైతే అందపు తరగతుల నిర్వహించి మెలికలు నేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు. ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదస్సు వద్ద జిల్లా ప్రతినిధులు

'స్టానా' సదస్సుకు గ్రానైట్ జిల్లా బృందం

ప్రజాశక్తి- టెక్కలి

గ్రానైట్ వ్యాపారంలో రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీని అవగాహన చేసుకున్నప్పుడే జిల్లా గ్రానైట్స్ ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మంచి గిరాకీ ఉంటుందని జిల్లా గ్రానైట్స్ వర్కర్స్ అండ్ యూనియన్ ప్రతినిధులు మురళీధర్ అన్నారు. కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో నిర్వహిస్తున్న స్టోనా-23 సదస్సుకు జిల్లా నుంచి వెళ్లిన బృందం అక్కడ వివరాలను గురువారం విడుదల చేశారు. శనివారంతో ఈ సదస్సులు ముగిస్తాయని తెలిపారు. గ్రానైట్ రంగంలో మార్పులు తీసుకొచ్చేందుకు జిల్లాలో పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ సదస్సుకు జిల్లా నుంచి 200 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనవడం వల్ల కొత్త టెక్నాలజీ, మెళకువలు నేర్చుకోవడానికి అవసరం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రానైట్స్ ప్రతినిధులు కూన రవికుమార్, కె.ఎం.ఎం.హరికుమార్, వరుదు దేవీప్రసాద్, సుంకర కృష్ణ, వి.వి.రాజు, చింతాడ గణపతి, అల్లు నగేష్, వి.వి.రాజు, దవళ రాజేంద్ర పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సోంపేట: పట్టణంలో నూతనంగా నిర్మించిన టిడిపి కార్యాలయాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ గురువారం ప్రారంభించారు. ఎన్నికల కోడ్ వెలువడడంతో ప్రారంభానికే పరిమితమయ్యారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.కె.నాయుడు, దేవు చిట్టిబాబు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శేఖర్, చిత్రాడ శ్రీను, మద్దిల నాగేశ్వరరావు, రాంబడ్డి గణపతి, మడ్డు కుమార్ పాల్గొన్నారు.

వేరుశనగలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

అవగాహన కల్పిస్తున్న భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- పోలాకి

రైతులు రబీ నూనె గింజలు పంటలో సమగ్ర యాజమాన్యపు పద్ధతులు తప్పనిసరిగా ఆచరించాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని కుసుమపోలవలస రైతు భరోసా కేంద్రం పరిధిలో వ్యవసాయ అధికారి చిరంజీవి ఆధ్వర్యాన లక్ష్మీనారాయణ పొలంలో వేరుశనగ సమగ్ర సాగు యాజమాన్య పద్ధతులపై గురువారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నూనె గింజల పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు ఆచరిస్తూ అధిక దిగుబడులు పొందేలా వ్యవసాయం చేసుకోవాలని తెలియజేశారు. ఉత్పత్తులకు విలువాధారిత యంత్రాలను వాడుతూ అధిక లాభాలను పొందాలని సూచించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి మాట్లాడుతూ వేరుశనగలు అన్ని సమగ్ర యాజమాన్య పద్ధతిలు పాటించాలన్నారు. వేరుశనగలు నిడువు చాళ్లలో విత్తనం వేయడం వల్ల కావాల్సిన సాంద్రతలో మొక్కలు ఉండి అధిక దిగుబడిని పొందడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఎడిఎ రవీంద్రభారతి మాట్లాడుతూ వేరుశనగలోని ఇతర పంటలు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ రైతులందరూ రైతు భరోసా కేంద్రాలు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ వేరుశనగలు అధిక దిగుబడులు పొందేందుకు జిప్సం వాడడం అవసరమని తెలియజేశారు. నూతన రకాలైన నిత్య హరిత కదిరి లేపాక్షి వంటి రకాలను రైతులు వేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌బికె విఎఎలు, గ్రామ అభ్యుదయ రైతులు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు

జలుమూరు: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విశ్రాంత ప్రిన్సిపాల్ కె.గాలి మోహనరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా ఫ్రెషర్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు అనుసరించి విద్యార్థులంతా దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.దుర్గారావు, విశ్రాంత లెక్చరర్ ఆర్.కృష్ణారావు, జి.రఘునాథ్, సిహెచ్.గోవింద్, కృష్ణారావు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో షాపు దగ్ధం

పలాస : కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో పూజ సామగ్రి దుకాణం అగ్నికి ఆహుతైంది. ఈ విషయాన్ని స్థానికులు షాప్ యజమాని ప్రదీప్ బెహరాకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చే సరికి పూర్తిగా కాలిపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం పలాస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.50 వేలు వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపక ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

భయపడొద్దు... సమస్యలు ఉంటే చెప్పండి

విద్యార్థులను పరామర్శించిన గౌతు శిరీష

విద్యార్థులను పరామర్శిస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస జ్యోతిరావుపూలే పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష గురువారం ఆస్పత్రి వెళ్లి పరామర్శించారు. వాంతులు, కళ్లు తిరగడం, శ్వాసకు సంబంధించిన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులకు శిరీషకు వివరించారు. అనంతరం ఆమె వైద్యాధికారులతో మాట్లాడారు. ఏ విద్యార్థీ భయపడనవసరం లేదని, ఏమైనా పాఠశాలలో ఇబ్బందులు ఉంటే ధైర్యంగా చెప్పాలని సూచించారు. ఉన్నత అధికారులతో మాట్లాడి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్, కొవ్వూరు సురేష్, జోగ మల్లి, దువ్వాడ సంతోష్‌కుమార్ ఉన్నారు.

'ఓపెన్ డే'పై అవగాహన

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17 న నిర్వహించే ఓపెన్ డేపై ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి అధ్యక్షతన అధ్యాపక బృందం గురువారం అవగాహన కల్పించారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సౌకర్యాలపై, వసతులపై సందర్శించవచ్చునన్నారు. డిగ్రీ కళాశాల ప్రగతి, ప్రయోగాలపై వివరించారు. అధ్యాపక బృందం రామకృష్ణ, దుర్యోధన, సంతోష్, శివకుమార్, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, వరప్రసాద్, త్రిపాఠి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

30 మంది రక్తదానం

బ్యాగులను అందజేస్తున్న వెంకటేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నందమూరి తారకరామ, మోక్షజ్ఞ సేవా సంఘం అధ్యక్షులు మాదారపు డేవిడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా ట్రెజరీ ఉద్యోగులు ప్రదీప్, రాజశేఖర్ నగరంలోని న్యూబ్లడ్ బ్యాంకులో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా ఈ శిబిరాన్ని నగర టిడిపి అధ్యక్షులు మదారపు వెంకటేష్ ప్రారంభించారు. 30 మంది రక్తదానం చేశారు. అలాగే నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న అర్బన్ హాస్టల్‌కు ఫ్యాన్, 70 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. న్యూబ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ ఆధ్వర్యాన లేపర్సీ కాలనీలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుంపా శివప్రసాద్, కొల్ల శ్రీనివాస్‌దేవ్, నగర పార్టీ కోశాధికారి పట్నాయకుని సతీష్‌బాబా, నగర యువత ఉపాధ్యక్షులు శిల్లా సురేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ జలగడుగుల జగన్, దిలీప్, సతీష్, రాజు పాల్గొన్నారు.

ఒడియా మాధ్యమం పుస్తకాలు అందజేత

పుస్తకాలు అందుకుంటున్న అపోటా సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

ఆంధ్రప్రదేశ్ లో ఒడియా మాధ్యమం చదువుతున్న 9,10 తరగతులకు సంభందించిన ప్రథమ భాష ఒడియా సాహిత్య పుస్తకాలు గురువారం బరంపురంలో అపోటా సభ్యులకు అందజేశారు. రూ.2 లక్షల విలువ చేసే ఈ పుస్తకాలను ఒడిశా మాధ్యమిక బోర్డు బరంపురం జోన్ డిప్యూటీ సెక్రటరీ సుభాష్ చంద్ర బెహరా, ఉత్తరాంధ్ర ఒడియా డిఐ దుర్గాప్రసాద్ చౌధురికి బరంపురం ఒడిశా మాధ్యమిక బోర్డు కార్యాలయంలో ఒడిశా సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢీ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ఒడియా లాంగ్వేజ్ పుస్తకాలు సకాలంలో అందించేలా కృషి చేసిన డిప్యూటీ సెక్రటరీ సుభాష్ చంద్ర బెహరా, శ్రీకాకుళం డిఇఒ గార పగడాలమ్మ, ఉత్కళ సమ్మిళనీ గంజాం శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రత కుమార్ సాహు, దీనబంధు శ్రీపల్లవకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలాయి, ఇచ్ఛాపురం బాపుజీ పాఠాగార్ అధ్యక్షుడు రఘునాథ గౌడ, ఉత్కళ సమ్మిళనీ, గంజాం శాఖ ప్రధాన కార్యదర్శి దీనబంధు శ్రీపల్లవ, అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దలాయి, త్రిలోచన పొల్లాయి పాల్గొన్నారు.

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

పలాస: కాశీబుగ్గ శ్రీసాయి శిరీష స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ కణితి విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు ఆకుకూరలు తినడం వల్ల కంటి జబ్బులు రాకుండా నిరోధించవచ్చు అన్నారు. ఈ మేరకు 350 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు టైఫాయిడ్ వాక్సినేషన్ వేశారు. కార్యక్రమంలో కంటి వైద్య పరీక్షలు డాక్టర్ షీలా థాంగరాజు, సాయి శిరీష స్కూల్ కవిటి భారతి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.అప్పారావు, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, బౌద్ధ భిక్షువు సిద్దార్ధ భంతి, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, ఆర్.హేమాచలం, కె.పి.రామన్న, ప్రవాస ఆంధ్రులు డాక్టర్ కణితి ఉష, డాక్టర్ కె.హేమాచలం తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పూర్వ వైభవానికి కృషి

రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

కార్యకర్తలతో అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల మధ్య ఎండగట్టేందుకు టిడిపి నాయకులు కలిసికట్టు పనిచేసి పూర్వ వైభవానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. మండలంలోని తర్లిపేటలో గురువారం పర్యటించి సర్పంచ్ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన కలుసుకొని తమ సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ముఖ హాజరు రద్దు చేయాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు, ఇతరులకు ముఖ హాజరును రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మిని గురువారం వినతిపత్రం అందజేశారు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, ఇంజినీరింగ్ ఉద్యోగులకు ముఖ హాజరు కచ్చిత విధానం అమలు చేయడం అభ్యంతరకరమన్నారు. ముఖ హాజరు విధానాన్ని తమ జీతాలకు ముడి పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల్లో అనేక మంది నిరక్షరాస్యులు ఉన్నారని, వారు ముఖ హాజరు వేసుకోలేకపోతున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రమేష్ పట్నాయక్, నరేష్, శంకరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో మానవుల హక్కులపై ప్రజాసంఘాలు చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి అన్నారు. స్థానిక దళిత హక్కుల పోరాట సమితి ముద్రించిన డైరీని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులపై అవగాహన చేసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు యడ్ల గోపి మాట్లాడుతూ దళితులకు వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనపాన షణ్ముఖరావు, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం : మండలంలోని నడిమివలసలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలి అప్పలసూరి చిన్నాన్న సూరప్పడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం పరామర్శించారు. ఈయన వెంట ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, బూత్ కమిటీ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, సర్పంచ్ ప్రతినిధి బాలి రమేష్, కొత్తపేట, జగన్నాథవలస సర్పంచ్‌లు మామిడి శ్రీనివాసరావు, బాణాన సూర్యనారాయణ ఉన్నారు. అంతకుముందు కొత్తపేటలో నిర్వహించిన భాగ్యలక్ష్మి పేరంటాల ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' ఆర్థికసాయం

పాతపట్నం : మండలంలోని కొరసవాడలో ఉన్న ముత్యాలమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు గురువారం పాల్గొన్నారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించి ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయాభివృద్ధికి ఆలయ కమిటీ సభ్యులకు రూ.25 వేలు విరాళంగా అందజేశారు. అలాగే గ్రామస్తులు ఎవరికైనా విద్య, వైద్యం, ఇతర సమస్యలపై తనను సంప్రదిస్తే తనవంతు సహాయం ఉంటుందని భరోసా ఇచ్చారు.

సోషల్ క్లబ్ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయొద్దు

ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయం పక్కన ఉన్న పంచాయ తీకి చెందిన సోషల్ క్లబ్ కార్యాలయాన్ని, స్థలాన్ని కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో విక్రయాలకు ప్రయత్నిస్తున్నారని, దాన్ని రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేయాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి కోరారు. స్థానిక సబ్ రిజిస్టార్ అధికారులను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 187పిలోని ఈ స్థలం 1966 నుంచి పంచాయతీ రికార్డుల్లో పంచాయతీ ఆస్తిగానే కొనసాగుతుందని అన్నారు. ఈ స్థలం విలువ పెరగడంతో దీనిపై కొంతమంది కబ్జాదారుల కన్ను పడిందని పేర్కొన్నారు. పంచాయతీ ఆస్తులు కబ్జాకు గురికాకుండా వాటి రక్షణ కోసం న్యాయ పోరాటమైనా చేస్తామని స్పష్టం చేశారు.

బాబు ఆదేశాలను శిరసావహిస్తాం

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలను క్రమశిక్షణతో పాటించేందుకు తామెప్పుడూ సిద్ధంగానే ఉంటానని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. గార మండలం శ్రీకూర్మంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. గడచిన నాలుగేళ్ల కాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చరిత్రలో నాలుగేళ్ల చీకటి కాలాన్ని ప్రజలు గడపాల్సి వచ్చిందన్నారు. మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు సిఎం జగన్ సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కైబాడి రాజు, గోర సురేష్, లోపింటి చిన్న, జల్లు రాజీవ్ పాల్గొన్నారు.

పాగాను ఊరేగిస్తున్న గ్రామస్తులు

శ్రీశైల మల్లన్న పాగా ఊరేగింపు

ఆమదాలవలస : మండలంలోని శ్రీనివాసచార్యులపేటలో చేనేత సంఘం తయారు చేసిన శ్రీశైల మల్లన్న పాగాను వీధుల్లో గురువారం ఊరేగించారు. సాయంత్రం శ్రీశైలం క్షేత్రానికి ప్రయాణమై అక్కడ శిఖరానికి చుట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శివ దీక్ష స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

కెజిబివి ఆకస్మిక తనిఖీ

సరుకులను పరిశీలిస్తున జయప్రకాష్

ప్రజాశక్తి- జలుమూరు

మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి ఆర్.జయప్రకాష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లాస్ రూములకు వెళ్లి విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలించారు. ఈ ఏడాది జరుగునున్న పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అనంతరం కిచెన్ రూమ్‌ను పరిశీలించి కూరగాయాలు, తదితర వస్తువులను పరిశీలించారు. ఆయనతోపాటు కెజిబివి ప్రిన్సిపాల్ శారద కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

మాట్లాడుతున్న తవిటినాయుడు

ప్రజాశక్తి- బూర్జ

పబ్లిక్ పరీక్షలు అంటు విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఎంఒ శివ్వాల తవిటినాయుడు అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థుల్లో ధైర్యం, స్ఫూర్తిని నింపడానికి శ్రీకాకుళం ఉపనిషత్ మందిరం నుంచి నర్సింహమూర్తి, విశ్రాంత గణిత అధ్యాపకులు, దుర్గారావు, విశ్రాంత వృక్షశాస్త్ర అధ్యాపకులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మోటివేషన్ తరగతులు నిర్వహించి చైతన్యపరిచారు. విద్య గొప్పతనం, స్వయం కృషి, పట్టుదల గురించి చెప్తూ... విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. నిరాశ పడకుండా లక్ష్యంతో చదువుకోవాలన్నారు. సెల్ ఫోన్లకు, టివిలకు దూరంగా ఉండాలన్నారు. 20 సంవత్సరాలు కృషి చేసి ఉన్నతంగా స్థిరపడితే 80 ఏళ్ల మంచి జీవితం గడపవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ చిరంజీవి, తెలుగు అధ్యాపకులు శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

13న 'చలో ఢిల్లీ'

శ్రీకాకుళం అర్బన్ : శిష్టకరకరణాల ఒబిసి సాధనకు కృషి చేస్తున్నారని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయపరంగా, విద్యాపరంగా వెనుకబడిన శిష్ట కరణాలను కేంద్ర బిసి జాబితాలో చేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఓ ప్రయివేటు అతిథి గృహంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. శిష్టకరణాలు ఒబిసి సాధించేందుకు మార్చి 13న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. జంతర్ మంతర్ వద్ద మౌన దీక్ష చేపట్టడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. జాతీయ కార్యదర్శి, ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, జిల్లా అధ్యక్షులు బలివాడ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి డబ్బిరు శ్రీనివాసరావు, కోశాధికారి ఊరటి కిరణ్‌బాబు, శ్రీరామ్ కుమార్, డాక్టర్ ఎ.కనకరాజు పాల్గొన్నారు.

చాపర విద్యార్థుల ప్రతిభ

మెళియాపుట్టి: మండలంలో చాపర ఉన్నత పాఠశాల విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. నెల్లూరులోని అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన 2023 ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చాపర నుంచి 61 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 8 మంది విద్యార్థులకు బంగారు పథకాలు, 53 మంది విద్యార్థులకు మెరిట్ ధ్రువపత్రాలు పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు మాధవరావుకు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి టిడిపి కార్యకర్తలు విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సూచించారు. స్థానిక కమల కళ్యాణ మండపంలో గురువారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో ఏర్పాటైన అన్న క్యాంటీన్‌ను పేదలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల

మాట్లాడుతున్న వెంకటరమణ

లలిత కుమారి, మాజీ మండల ఉపాధ్యక్షులు బైర్నింగ్ దినకర్, మాలతి శ్రీధర్, బమ్మిడి భాస్కరరావు, రవ్వల గణపతి, ఉర్లాన వసంత్, కృష్ణారావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న రవి

మెరుగైన వైద్యం అందించాలి

పలాస : పలాస జ్యోతిరావుపూలే పాఠశాల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతిరావు పూలే విద్యార్థులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విషయమై సమగ్రంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. సరైన భోజనం అందించాలని కోరారు. ఆయనతో పాటు ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రాజు, పవన్ ఉన్నారు.

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి కళ్యాణం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో సాంప్రదాయ బద్ధంగా, వైభవంగా గురువారం నిర్వహించారు. మాఘ బహుళ ఏకాదశిని (మత్రయ) పురస్కరించుకొని స్వామికి ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ అర్చకులు ఈ కళ్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరిసూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

టెక్కలి: డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ చదువులతో పాటు ఆర్థికపరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలని టెక్కలి యూనియన్ బ్యాంకు మేనేజర్ డి.రూన్సీరాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం దేశ, ప్రపంచ మూలాలు ఆర్థిక భారంపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు

మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ రూన్సీరాణి

గోవిందమ్మ మాట్లాడుతు రోజూ విద్యార్థులు తమ ఇంటి వద్ద నుంచి తెస్తున్న డబ్బులు ఎక్కడివి, ఎవరు ఇచ్చారు, మనం ఎందుకు ఖర్చు పెట్టుకోవాలి అనే చిన్నపాటి విషయంపై ఆలోచిస్తే మంచి ఫలితాలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి కె.గిరిజాశంకర్, అధ్యాపకులు బేపల సతీష్‌కుమార్, లూక్‌పాల్, శ్రీనివాసపట్నాయక్ హేమరాజు, మల్లేశ్వరరావు, పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న శ్రీరామ్మూర్తి

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని మండాది ఇటీవల లారీ ఢీకొని నలుగురు ఉపాధి కూలీలు మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎంపిపి ప్రతినిధి, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాద ఘటన జరిగిన వెంటనే శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తక్షణమే స్పందించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారాన్ని ఆయా కుటుంబాలకు అందేలా స్పీకర్ చర్యలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ సైలాడ దాసునాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట : మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలో గల రేగులగూడ కాలనీలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రీసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరావు చిరుధాన్యాల సాగును రైతులకు వివరించారు. గుళిరాగి, లైన్ షోయింగ్ పద్ధతుల ద్వారా సాగు చేస్తే తక్కువ విత్తనాలు, పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని వివరించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయంతో కూరగాయలు, వరి పండిస్తే ఆరోగ్యం పొందవచ్చునని తెలిపారు. అనంతరం జీడి పంటకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పులిపుట్టి సర్పంచ్ సవర బాజన్న, డిహెచ్ఒ అమరేశ్వరి, పులిపుట్టి గ్రామ సచివాలయం నుంచి హార్టికల్చర్ ఆఫీసర్ దివాకర్ గారు, రేగులగూడ కాలనీ, పాతరేగులగూడ, వేంపలగూడ నుంచి 32 మంది రైతులు పాల్గొన్నారు.

టిడిపిలో సీనియర్లకు అన్యాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పార్టీని నమ్ముకొని నిజాయితీగా పనిచేసే వారికి తెలుగుదేశం పార్టీలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఈర్లె శ్రీరామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని నాగావళి హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌టి రామారావు సమక్షంలో టిడిపిలో చేరి 40 ఏళ్లగా ఆ పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధి కృషి చేశానని అన్నారు. తన ఉద్యోగాన్ని సైతం పక్కన పెట్టి పార్టీ కోసం అహర్నిశలు శ్రమించానని చెప్పారు. తనకు ఎమ్మెల్సీగా రాకుండా అయ్యన్నపాత్రుడు అడ్డుకున్నాడని ఆరోపించారు. చంద్రబాబు కాంగ్రెస్ నుంచి

మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

వచ్చారని, కానీ తాను టిడిపి పుట్టుక నుంచి పార్టీలో ఉన్నానని అయ్యన్నపాత్రుడు బహిరంగంగా చెబుతున్నారని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తుల వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోతుందని, అందుకే రెబల్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ బరిలో ఉన్నానని పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈయన వెంట రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాశరావు, సెక్రటరీ నర్సింహమూర్తి ఉన్నారు.

రవికుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

'108' డివిజన్ మేనేజర్‌కి సన్మానం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ-పలాస డివిజన్‌లో 108 మేనేజర్‌గా పనిచేస్తున్న జనపాల రవికుమార్‌కు జిల్లా 108 ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు. పలాస నుంచి విజయనగరం బదిలీపై వెళ్తున్న సందర్భంగా సన్మానం చేశామని ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ నజీర్, లక్ష్మణ్ భాస్కర్, సత్యం, వెంకటరావు, తారక్, ఢిల్లీ, మురళి, నారాయణ పాల్గొన్నారు.

కొంక్యానపేటలో అన్నదానం

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

శ్రీకాకుళం అర్బన్ : మండలంలోని కొంక్యానపేటలో టిటిడి ఆర్థిక సహాయం, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన సీతారామాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం నిర్వహించారు. శాలిహుండాం శ్వేతగిరి వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మహేంద్రాడ వేణుగోపాలచా ర్యులు, నాగరాజు శర్మ, ఆరవిల్లి శ్రీనివాసాచార్యులు, చామర్తి రాంబాబుచార్యులు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం టెక్కలికి చెందిన గాయకులు జీరు కృష్ణారావు బందంచే భక్తి రంజని కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోన్ కన్వీనర్ గరిమెళ్ల రాధాకృష్ణ, టిటిడి గుడుల నిర్మాణ ఇన్‌ఛార్జి కోరాడ రాంప్రసాద్, శాలిహుండాం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, ఎంపిటిసి గుండ భాస్కరరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, మాజీ ఎంపిపి గుండ అమ్ములు, మాజీ ఎంపిటిసి కొంక్యాన జయలక్ష్మి కొంక్యాన రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాదేవిపురంలో 'ఇదేం ఖర్మ'

పలాస : వజ్రపుకొత్తూరు మండలం మహాదేవిపురంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు టిడిపి ఆధ్వర్యాన ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి హాజరు అవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పలాస నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న సంధ్యారాణి

మత్తుపానీయాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

సమాజిలో చెడు ప్రభావానికి గురి చేస్తున్న డ్రగ్స్‌కు, మత్తు పానీయాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె.సంధ్యారాణి సూచించారు. నరసన్నపేటలోని ఎల్‌విఆర్ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ ఉపయోగించడం వల్ల కలుగు అనార్థాలు, ఆరోగ్య సమస్యలు తదితర అంశాలను విద్యార్థులకువివరించారు. డ్రగ్స్ ఉపయోగించి పోలీసులకు పట్టుబడితే విధించే శిక్షలు, జరిమానాలు తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అప్పలనాయుడు

బాతువ పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి- జి.సిగడాం

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు వైద్యులకు సూచించారు. మండలంలోని బాతువ ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిని గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో పాముకాటుకు, కుక్కకాటుకు టీకాలు, అత్యవసర చికిత్స కిట్లు ఉన్నాయా? లేవా? అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఆదినారాయణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శ

మండలంలోని గెడ్డకంచరాం, డి.ఆర్.వలస, బాతువ గ్రామాల్లోని టిడిపి నాయకుల ఇళ్లకు వెళ్లి ఆత్మీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కొత్తగా వచ్చిన ఓటర్ల జాబితాను అందించి జాబితాను పరిశీలించాలని, అందులోని మార్పులను, చేర్పులు సరిచేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

లైన్‌మేన్‌కు గాయాలు

మెళియాపుట్టి : మండలంలోని చాపర రైస్‌మిల్లు సమీపంలో విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న పెద్దలక్ష్మీపురం సచివాలయ విద్యుత్ లైన్‌మేన్ సుదర్శనరావు గురువారం విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. స్తంభం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎల్‌సి ఇచ్చాడు. అనంతరం విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే ప్రధాన విద్యుత్ లైన్ సరఫరాను నిలుపుదల చేసి చాపర పిహెచ్‌సికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

స్తంభంపై షాక్‌కు గురైన లైన్‌మేన్